భూమికి బలం.. రైతుకు లాభం

- అన్నదాతలకు అండగా పీఎండీఎస్ విధానం
- 31 రకాల విత్తనాలతో కూడిన 20 కేజీల కిట్లు అందజేత
- నేలలో నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెంపుదల
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు


పీఎండీఎస్ కిట్లతో సాగు చేసిన పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాయచోటి జగదాంబ సెంటర్: అన్నదాతలు సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో ఖరీఫ్, రబీ సాగు చేయబోయే రైతులకు అధిక దిగుబడులు సాధించేందుకు చీడపీడలు ఆశించకుండా ప్రీ మాన్ సూన్ డ్రై సోయింగ్(పీఎండీఎస్) విధానం కొండంత అండగా నిలుస్తోంది. పీఎండీఎస్ అంటే తొలకరి వర్షాలకు ముందే విత్తనాలు నాటే పద్ధతి. ఇది ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించడం. ఈ విధానంలో పంటలు పండిస్తే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చు. నీటి వృథాను అరికట్టవచ్చు. భూమికి బలం చేకూరుతుంది. ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కిట్లను రూపొందించి రైతులకు విక్రయిస్తున్నారు. 31 రకాల విత్తనాలు కలగలిపి 20 కేజీల కిట్లను తయారు చేసి రైతులకు అందజేస్తున్నారు. దీని ద్వారా రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లిస్తున్నారు.

కిట్‌లో లభ్యమయ్యే విత్తనాలు

పీఎండీఎస్ పేరుతో ప్రత్యేకంగా రూపొందించిన కిట్లలో 31 రకాల విత్తనాలు ఉంటాయి. పప్పు దినుసులు, చిరుధాన్యాలు, నూనె గింజలు, ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి, సుగంధ ద్రవ్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు కలిపి కిట్‌గా అందిస్తారు. జొన్నలు, సజ్జలు, రాగులు, పిల్లిపెసర, అలసందలు, నువ్వులు, ఉలవలు, జనుము, జీలుగ, శనగలు, బొబ్బర్లు, మొక్కజొన్న, కందులు, మినుము, గోగులు, ఆవాలు, ఆముదం, సొర, బీర, దోస, కాకర, చుక్కకూర, తోటకూర, పాలకూర, మెంతులు, ధనియాలు, గోరుచిక్కుడు, బెండ, ముల్లంగి, బీన్స్ లాంటి 31 రకాల విత్తనాలు పీఎండీఎస్ కిట్ ద్వారా అందజేస్తున్నారు. 20 కేజీల కిట్‌ను రూ.1,600లకు విక్రయిస్తున్నారు.

భూమికి అదనపు ప్రయోజనం

ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ విధానంలో ప్రధాన పొలం సిద్ధం చేసిన నాటి నుంచి బీజామృతంతో విత్తనశుద్ధి చేసి ఘనజీవామృతం, ద్రవజీవామృతం, గ్రోత్ ప్రమోటర్లు అంతర పంటలు వేయడం ద్వారా భూమిలో స్వభావం మారి వేయబోయే పంటలకు అదనపు లాభాలను తెచ్చిపెడుతుంది. మొక్క ఆకు గరుకుగా మారి పంటకు పురుగు ఆశించదు. ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ విధానం ద్వారా మొక్కలకు భాస్వరం, పొటాషియం, కార్బన్, కాల్షియం, మెగ్నీషియం, బోరాన్, ఐరన్, జింక్ లాంటి పోషకాలు అందుతాయి. ఏటా ఖరీఫ్‌కు ముందు పీఎండీఎస్ వేయడం ద్వారా భూమి సారవంతంగా మారడంతో పాటు నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. ఎకరాకు 20 కేజీల విత్తనాలు చల్లడం ద్వారా 20 టన్నుల ఎరువుకు సమానమైన బలాన్ని భూమికి అందిస్తుంది. తొలకరి వర్షాలు పడ్డాక ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు, సాధారణ పద్ధతిలో సాగు చేసే రైతులు ముందస్తుగా కిట్లను చల్లడం ద్వారా భూమికి సారం పెరిగి అధిక దిగుబడులు, పశువులకు మేతను పొందవచ్చు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు ప్రారంభం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని విధాలుగా అన్నదాతకు అండగా ఉండేందుకు ప్రతిష్టాత్మకంగా 2021 నుంచి రైతులను లాభసాటి వ్యవసాయం వైపు మళ్లించి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సంప్రదాయ వ్యవసాయానికి సాంకేతికతను జోడించి పీఎండీఎస్ కిట్లను అందిస్తున్నారు.


పంట దిగుబడుల ప్రదర్శన

దీంతో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

అదనపు లాభాలు పొందవచ్చు



పీఎండీఎస్ కిట్లను తొలకరి వర్షాలు పడ్డాక భూమిలో చల్లడం ద్వారా రైతులు అదనపు లాభాలు పొందవచ్చు. నేలలో సూక్ష్మ జీవులు అధికమవ్వడం ద్వారా కర్బన శాతం పెరుగుతుంది. ప్రధాన పంటలకు కావాల్సిన పోషకాలు నేల నుంచే లభ్యమవుతాయి. కలుపు తక్కువగా రావడంతో పాటు భూమి గుల్ల బారుతుంది. నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం కలిగి ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటుంది. వరికి ఎకరాకు ఒక కిట్, మిర్చి తదితర పంటలకు ఎకరాకు 3 కిట్ల చొప్పున వేసుకోవచ్చు.

– బి.వెంకటమోహన్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్, రాయచోటి

ఆగిన బెంగళూరు బస్సు

బి.కొత్తకోట: బి.కొత్తకోట–బెంగళూరు మధ్య నడిచే మదనపల్లె–1 డిపో ఆర్టీసీ ప్రమాదం కారణంగా శనివారం సర్వీసు నడవలేదు. తెల్లవారుజాము 3.30 గంటలకు మదనపల్లె నుంచి బి.కొత్తకోటకు వస్తున్న బెంగళూరు బస్సు స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని బత్తలాపురం మలుపు తిరుగుతున్న సమయంలో బీసీకాలనీకి చెందిన కే.విజయ కుమార్ (28) బస్సు వెనుక భాగం తగిలింది. దీనితో తలకు గాయం కావడంతో బాధితున్ని మదనపల్లెకు తర్వాత బెంగళూరుకు వైద్యం కోసం తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీస్‌స్టేషన్ తరలించగా బెంగళూరు సర్వీసు రద్దయింది. దీనితో మదనపల్లె నుంచి వస్తున్న ప్రయాణికులకు చార్జీ సొమ్మును వెనక్కి ఇవ్వడంతో ప్రైవేటు బస్సుల్లో బెంగళూరు వెళ్లారు.

జూలై 5న లోక్ అదాలత్


మాట్లాడుతున్న జడ్జి ఎ. మహేష్

పీలేరురూరల్: జూలై 5వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా 11వ అదనపు జడ్జి ఎ. మహేష్ అన్నారు. శనివారం స్థానిక ఏడీజే కోర్టులో న్యాయవాదులు, పోలీసులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో కుటుంబ తగాదాలు, మోటారు వాహన కేసులు, బీఎస్ఎన్ఎల్ కేసులు, ఇన్సూరెన్స్ మొదలగు పెండింగ్ కేసులకు సంబంధించి ఇరు వర్గాలను ఒప్పించి కేసులు పరిష్కరించాలన్నారు. రాజీమార్గమే రాజమార్గమన్నారు. ఎక్కువ కేసులు పరిష్కారినికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, సీఐ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థిని ఔదార్యం


ప్రత్యూష ఇచ్చిన నగదుతో తెచ్చిన బీరువాలు

సిద్దవటం: పదో తరగతి విద్యార్థిని ప్రత్యూష షైనింగ్ స్టార్స్ ద్వారా ప్రభుత్వం ఇచ్చిన రూ.20వేల నగదు పాఠశాల అభివృద్ధికి ఇచ్చి ఔదార్యం చాటుకున్నారు. మండల కేంద్రమైన సిద్దవటం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పది చదివిన ప్రత్యూష 586 మార్కులు సాధించి భేష్ అనిపించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు షైనింగ్ స్టార్ కింద రూ.20 నగదు అందజేసింది. పాఠశాల అవసరాలకు వినియోగించాలంటూ ప్రత్యూష ఆ నగదును తనకు అందజేశారని, ఆ నగదుతో రెండు బీరువాలు తెచ్చామని హెచ్ఎం శ్రీరాములు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటీశ్వరులు.. అల్లులే


పింఛన్ అందజేస్తున్న నూరుల్లా, సుబహాన్

ఒంటిమిట్ట: కోటీశ్వరుడు.. దేవుడు ముందు అల్పుడేనని జామియా నూరుల్లా ఇస్లామిక్ ట్రస్టు అధినేత అబ్దుల్ సుబహాన్ అన్నారు. మండలంలోని మలకాటిపల్లి జామియా నూరుల్లా ఇస్లామిక్ ట్రస్టు నిరుపేదలకు ట్రస్టు అధినేత సుబహాన్ శనివారం ఆర్థికసాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతినెలా పింఛన్ రాని భర్తలేని వితంతువులు, వికలాంగులు, మౌజనులకు, ఒంటరి మహిళలకు ఆర్థికసాయం అందజేశారు. ట్రస్టు అధినేత అబ్దుల్ సుబహాన్ మాట్లాడుతూ పేదలకు సహాయం చేస్తే ఆ దేవుడి ఆశీస్సులు ఎప్పటికీ ఉంటాయని తెలిపారు.

రేపు నాగారపమ్మ జాతర


నాగారపమ్మ తల్లి

సుండుపల్లె: మండలంలోని బండకాడ ఈడిగ పల్లెలో వెలసిన నాగారపమ్మ తల్లి జాతర సోమవారం అంగరంగ వైభవం జరిగిందని అన్నమయ్య జిల్లా డీజే ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరునాల అనంతరం ఏటా మూడోవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. రాత్రికి చెక్కభజన, చాందినీ బండ్లతో తిరుణాల జరుపుతున్నట్లు వారు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

ఒంటిమిట్ట: మండలంలోని పోలుబుచ్చయ్యగారిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నల్గొండ గంగిరెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి శనివారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం గంగిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, గుండుమల్లికార్జునరెడ్డి, రవిచంద్రారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక


ప్రణతి

పెనగలూరు: కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఎన్ఎంఎంఎస్ 2024–25 విద్యా సంవత్సరానికి మారంరెడ్డి ప్రణతి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ ఏటా రూ.12 వేల స్కాలర్ షిప్ అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ స్కాలర్ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం బ్యాంక్ అకౌంట్‌లో నేరుగా జమ చేస్తుందన్నారు.

సేవ చేయడంలోనే తృప్తి


ఫౌండేషన్‌ను ప్రారంభిస్తున్న రుద్రరాజు వెంకటరవి

రాయచోటి టౌన్: పేదలకు సేవ చేయడంలోనే ఎంతో తృప్తి ఉంటుందని ఇంపాక్ట్ ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు డాక్టర్ రుద్రరాజు వెంకటరవి అన్నారు. రాయచోటి పట్టణంలోని ఏజీ గార్డెన్ సమీపంలో శనివారం ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఎన్‌జీవో కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా పేదలకు సేవలదిస్తున్నట్లు తెలిపారు. సంస్థ వ్యవస్థాపకుడు సోమలరాజు శివరాజు మాట్లాడుతూ ఇప్పటికే మైలవరంలోని బత్తనపల్లెలో సీనియర్ సిటిజన్స్ హోం నిర్వహిస్తోందని తెలిపారు. యంసీహెచ్ సుబ్బారెడ్డి, సురేంద్రారెడ్డి, మహమ్మద్ పఠాన్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై సంతకాల సేకరణ


సంతకాల సేకరణ చేస్తున్న సీపీఐ నాయకులు

పెనగలూరు: కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా . ఈ నెల 20, 21వ తేదీలలో లక్ష సంతకాల సేకరణ చేపడుతున్నట్లు సీపీఐ నాయకుడు గానుగపెంట ఆదినారాయణ తెలిపారు. నియోజకవర్గంలో అన్నమయ్య జిల్లా ప్రాజెక్టు సత్వర నిర్మాణం, మూతబడిన పరిశ్రమలు తెరవాలని, గాలేరు నగిరి ప్రాజెక్టుకు పూర్తి నిధుల కేటాయింపు, కోడూరు నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, రైల్వేకోడూరు–వెంకటగిరి రోడ్డు రైల్వేలైను పూర్తిచేయాలని, ఓబులవారిపల్లి నుండి కృష్ణపట్నం వరకు రైల్వే ప్యాసింజర్ రైలు నడపాలనే డిమాండ్లతో సంతకాల సేకరణ చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, లక్ష్మీనారాయణ, రేవూరి శంకరయ్య, ఓబులేసు, గానుగపెంట బాలసుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థను తప్పుదోవ పట్టిస్తున్న ప్రభుత్వం


మాట్లాడుతున్న శిబ్యాల విజయభాస్కర్

రాయచోటి టౌన్: కూటమి ప్రభుత్వం వ్యవస్థను తప్పుదోవ పట్టించి, తప్పుడు కేసులు పెట్టడంలో మొదటి స్థానంలో నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ అన్నారు. రాయచోటి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ పల్నాడ్‌లో కూటమి ప్రభుత్వం వేధింపులకు తాళలేక కొర్లకుంట నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకొని చనిపోయారని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెళ్తే పోలీసులు అంక్షలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. సినిమా డైలాగ్‌ను ఒక అభిమాని ప్లకార్డు పట్టకొని చూపిస్తే అతడిపై కేసులు పెట్టి 24 రోజులు రిమాండ్ విధించారన్నారు. తప్పుడు కేసులు పెట్టడం మానేసి హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కిశోర్‌దాస్‌రెడ్డి, పరశురాంనాయుడు, రెడ్డికుమార్, అజ్మత్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టిగా కృషిచేయాలి

– మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి

మదనపల్లె రూరల్ : నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, లోక్‌సభపక్షనేత, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి సూచించారు. మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తిరుపతిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. దుశ్శాలువతో సత్కరించి పూల బొకేలు అందజేశారు. అనంతరం నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు.పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు చేయాల్సిన చర్యలపై వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అందిన సంక్షేమం, అభివృద్ధిని వివరించి, చంద్రబాబు చేసిన మోసాలపై తెలపాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలను గుర్తించి, నాయకుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో పార్టీలో యాక్టివ్‌గా పనిచేసి, ప్రస్తుతం సైలెంట్‌గా ఉన్న వారిని గుర్తించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీనే అని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు శ్రమించాలన్నారు. వీఎస్.రెడ్డి, ఆవుల మల్లికార్జున, రమేష్, రఘునాథరెడ్డి, మహేశ్వరరెడ్డి, శంకర, వెంకటేష్, రాఘవ, బాలకృష్ణ, హరినాథ్, ప్రసాద్, దినకర్ పాల్గొన్నారు.

ఆరోగ్య యోగా.. జనంతో నిండుగా


రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీలో యోగా డే


మంగంపేట ఏపీఎండీసీ పాఠశాల మైదానంలో యోగా చేస్తున్న ప్రజలు

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాతో ఆరోగ్యం నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించారు. రాజంపేట, రాయచోటి, రైల్వే కోడూరు నియోజకవర్గాల్లోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల వద్ద పెద్ద ఎత్తున జనం పాల్గొని యోగాసనాలు వేశారు. అన్నమాచార్య యూనవర్సిటీలో యోగా డే నిర్వహించారు. రాజంపేట పట్టణంలో మున్సిపాలిటీ కమిషనరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో యోగా డే చేపట్టారు. రాజంపేట నియోజకవర్గంలోని సుండుపల్లె, పెనగలూరు, ఒంటిమిట్ట, నందలూరు, సిద్దవటం, వీరబల్లి మండలాల జెడ్పీ పాఠశాలల్లోనూ యోగా డే నిర్వహించారు. సంబేపల్లె, లక్కిరెడ్డిపల్లెల్లోనూ యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని రైల్వే కోడూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, లక్కిరెడ్డిపల్లి పాఠశాలల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మంగంపేట ఏపీఎండీసీ ఉన్నత పాఠశాలలో వేయిమందిచే యోగా గురువు ఎం.రాజశేఖల్ ఆసనాలు వేయించారు. జువలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రాష్ట్ర బృందం సభ్యులు హాజరయ్యారు. – సాక్షి నెట్‌వర్క్


రాయచోటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

తీరిన నీటి సమస్య


రాత్రివేళలో గిరిజనులకు నీరు అందిస్తున్న ఎంపీటీసీ మల్లికార్జున

రైల్వేకోడూరు అర్బన్: మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలోని ఇందిరానగర్‌లో గత మూడు రోజులుగా నీటి సమస్యతో అల్లాడుతున్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎంపిటిసి బండారు మల్లికార్జున శనివారం మూడు నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీటి సమస్య లేకుండా చూశారు. పలువురు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ ఎమ్మెల్యేపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

పెద్దతిప్పసముద్రం: దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను అవమానించిన బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోతుపేటకు చెందిన నేషనల్ హెల్ప్‌లైన్ అగేనెస్ట్ అట్రాసిటీ (ఎన్‌హెచ్ఏఏ) ఫీల్డ్ లెవల్ కౌన్సిలర్ కేవీ రమణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆదోని మండలం ధనాపురం గ్రామ దళిత సర్పంచ్‌ని స్టేజి పైకి రావాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పిలవగానే పక్కనే ఉన్న టీడీపీ నాయకురాలు గుడిసె క్రిష్ణమ్మ కలుగజేసుకుని అతను ఎస్సీ సర్పంచ్ స్టేజి పైకి రాడు అని ఎమ్మెల్యేకు సూచించగా నువ్వు ఇక్కడకు వచ్చి కింద నిల్చుకో అని తన కాళ్ళ వద్ద స్టేజి కింద స్థలాన్ని చూపి అవమానపరచడం ఎంత వరకు సమంజసమని ఆరోపించారు. సభలో గ్రామ ప్రథమ పౌరుడైన దళిత సర్పంచ్‌ను కులం పేరుతో వివక్షత చూపి అవమానించిన ఎమ్మెల్యే, టీడీపీ నాయకురాలిపై కేసు నమోదు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం దళిత కాలనీల్లో ఇంటింటికీ తిరిగిన కూటమి నేతలకు అప్పుడు దళితులనే విషయం తెలియలేదా అంటూ ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్, హైకోర్టు లీగల్ సెల్ అథారిటీ వెంటనే ఈ ఘటనపై స్పందించి ఈ కులోన్మాదులపై చర్యలు తీసుకుని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కేవీ రమణ డిమాండ్ చేశారు.

భిక్షాటనతో మున్సిపల్ కార్మికుల నిరసన


భిక్షాటన చేస్తున్న కార్మికులు

మదనపల్లె: పట్టణంలో 18 రోజులుగా తమ డిమాండ్ల పరిష్కారం కోసం నిరాహార దీక్షలు చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు శనివారం భిక్షాటన ద్వారా నిరసన వ్యక్తం చేశారు. చేతిలో ప్లేట్లు పెట్టుకుని కనికరించు చంద్రబాబూ అంటూ భిక్షాటన చేశారు. చొక్కాలు తీసేసి మున్సిపల్ కార్యాలయం రోడ్డుపై ఈ నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయపరమైన డిమాండ్ల కోసం ఇంకెంత కాలం ఆందోళనలు చేయాలంటూ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన సమ్మె గడువు ముగిసిందని, ఆదివారం నుంచి మదనపల్లె మున్సిపాలిటి పరిధిలో తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ చేయబోమని, పూర్తిస్థాయిలో సమ్మెలోకి దిగుతున్నట్టు చెప్పారు. ప్రభుత్వం ఇంజనీరింగ్ విభాగం కార్మికుల సమాన పనికి సమాన వేతనం, ప్రభుత్వ పథకాల వర్తింపు, టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బందికి నిర్ణీత వేతనాల చెల్లింపు తదితర సమస్యలను పరిష్కరించాలని కార్మికులు నినాదాలు చేశారు.

కార్యక్రమంలో ఎస్‌కే.రెడ్డెప్ప, నాగరాజు, కన్నయ్య, గోపాలకృష్ణ, సజాద్, బాబు, ఎస్‌కే.రెడ్డెప్ప, ఎంఎస్.కన్నయ్య, కుమార్, మహేష్ కార్మికులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహుడికి విశేష పూజలు


తరిగొండలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో తరిగొండ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. యోగినీ ఏకాదశి సందర్భాన్ని పురస్కరించుకొని వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. చారిత్రాత్మక గుర్రంకొండ కోటలోని శ్రీ నృసింహస్వామి ఆలయంలో వేకువజామేన అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకొని స్వామివార్లను సేవించుకొన్నారు. స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఆలయఅర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకం.. జీవన శైలిలో భాగం


సిద్దవటంలో మొక్క నాటుతున్న రేంజర్ కళావతి


రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో


నందలూరులో మొక్కలు నాటుతున్న తహసీల్దారు

నందలూరు: మొక్కల పెంపకం మానవ జీవనశైలిలో భాగం కావాలని మండల ప్రత్యేకాధికారి గుణశేఖర్‌పిళ్లై, తహసీల్దారు అమరేశ్వరి, ఎంపీడీఓ రాధాకృష్ణ పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో భాగంగా నాగిరెడ్డిపల్లిలో శనివారం ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ ఆఫీస్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసి ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి కాటన్ సంచులను వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సురేష్‌బాబు, సురేష్, వెంకటరమణ, సర్పంచ్ జంబుసూర్యనారాయణ పాల్గొన్నారు.

సిద్దవటం: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ప్రకాష్ తెలిపారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం వైద్య సిబ్బందితో కలిసి ఆయన పిచ్చి మొక్కలు , చెత్తా చెదారం తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలని, కలుషిత నీరు తాగితే సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, మొక్కలు నాటి వాటిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శివాని, మురళీమోహన్, నాగరాజు, అరుణపాల్గొన్నారు.

మొక్కలు నాటిన రేంజర్

సిద్దవటం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ సిబ్బందితో కలిసి యోగాసనాలు వేసినట్లు రేంజర్ కళావతి తెలిపారు. సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో శనివారం మొక్కలు నాటారు. రేంజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగా చేసుకొని ఆరోగ్యాన్ని మెరుగు పరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఓబులేసు, పెంచల్‌రెడ్డి, విశ్వనాథ్, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి

పెనగలూరు: ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటాలని ఎంపీడీఓ విజయారావు, మండల ప్రత్యేక అధికారి పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగాపెనగలూరు సచివాలయ ప్రాంగణంలో శనివారం ఉదయం ఆయన మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ కాల్వల్లో చెత్తను జేసీబీచే తొలగింపజేశామని, రికార్డులను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రాయచోటి: రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.ఎం.మునియానాయక్ హాజరై విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, సిబ్బంది కళాశాల ఆవరణలో మొక్కలు నాటి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. రాయచోటి మండలం చెన్నముక్కపల్లె పంచాయతీ కార్యాలయంలో అధికారులు మొక్కలు నాటారు.